క్లుప్తంగా

సున్నం బట్టి కార్మికుడి మృతి


మృతి చెందిన మాదాసు రామయ్య

పిడుగురాళ్ల: సున్నంబట్టిలో పని చేసే కార్మికుడు గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. వివరాలు.. పట్టణంలో పిలుట్ల రోడ్డులో మాదాసు రామయ్య(55) ఒక్కసారిగా కూర్చున్న చోటే కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతుడు రామయ్య వివరాలను సేకరించారు. అడిగోప్పల గ్రామానికి చెందిన రామయ్య గత ఎనిమిది సంవత్సరాల నుంచి పిడుగురాళ్ల పట్టణంలో నివసిస్తూ సున్నం బట్టీల్లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే పనిలోకి వెళ్లేదుకు పిల్లుట్ల రోడ్డులో కూర్చోవడంతో గుండెపోటు రావడం వలన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి కుమారుడు శ్రీకాంత్‌కు సమాచారం అందించి మృతదేహాన్ని అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

భావితరాల కోసం మొక్కలు నాటాలి

జెట్టిపాలెం(రెంటచింతల): భావితరాల ఉజ్వల భవిష్యత్ కోసం పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం అమ్మపేరుతో ఓ మొక్క నాటాలని మాచర్ల నియోజకవర్గ బీజేపీ నాయకులు పోకూరి కాశీపతి అన్నారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయంలో ప్రధాని నరేంద్రమోదీ 11 సంవత్సరాల సుపరి పాలన, వికసిత భారత్, అమృతకాలం సేవ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా అమ్మపేరుతో ఓ మొక్క కార్యక్రమంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బోయ నాగిరెడ్డి పాల్గొన్నారు.

సత్యసాయి రథయాత్రకు భక్త నీరాజనం



రెంటచింతల: మండల కేంద్రానికి చేరుకున్న సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్రకు బుధవారం భక్తులు నీరాజనం పలికారు. గ్రామంలో స్వామి రథం ఊరేగింపు నిర్వహించే మార్గంలో స్థానిక శ్రీ రామకృష్ణగురుకుల పాఠశాల విద్యార్థులు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్యసాయి భక్తజన మండలి సభ్యులు నాళం నర్సింహారావు మాట్లాడుతూ పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను పురస్కరించుకుని ఈ రథయాత్ర దేశవ్యాప్తంగా ఏప్రిల్ 24న ప్రారంభమైందన్నారు. మొత్తం నాలుగు ప్రేమ ప్రవాహిని రథాలు దేశ వ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తజన మండలి సభ్యులు యేచూరి సాంబశివరావు, నాళం పెదబాబు, గుండారా మ్మూర్తి, యేచూరి కాశీపతి, కట్టమూరి బుల్లి కోటేశ్వరరావు, నాళం చినబాబు, ఆగ్రో శ్రీను, ఇందిరమ్మ, మండువ లక్ష్మి, పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

సత్తెనపల్లి: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొమ్మ రాజశేఖర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు బుధవారం అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు వెంటనే వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షరతులు లేకుండా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు మేడి సత్యవతి, జల్లి రమేష్, చిలకా సునీత, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు పశువులు మృతి



అచ్చంపేట: విద్యుత్ షాక్‌కు రెండు పశువులు మృతి చెందిన ఘటన మండలంలోని కోనూరు, నిండుజర్ల గ్రామాలలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బుధవారం ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నాయి. కోనూరులో మచ్చ సీతారామప్రసాద్‌కు చెందిన పాడి గేదె తెగి కింద పడిన విద్యుత్ వైర్లకు తగలడంతో ప్రమాదం జరిగింది. ఈ గేదె ఖరీదు సుమారు రూ.50 వేల వరకు ఉండవచ్చని అంచనా. నిండుజర్ల గ్రామంలో కూడా విద్యుత్ స్తంభాలకు అమర్చని తీగలకు తగిలి వ్యవసాయానికి వినియోగించే లక్ష రూపాయల ఖరీదు చేసే ఎద్దు మృతి చెందింది. ఈ ఎద్దు చనిపోవడంతో దీనికి జతకట్టే మరో ఎద్దు గడ్డి కూడా మేయడం లేదని సంబంధిత రైతు వాపోతున్నారు. తక్షణమే తమకు పరిహారం ఇప్పించాలని వారు కోరారు. అంతకు ముందు ఒక గొర్రె కూడా విద్యుత్ షాక్ వల్ల మృతి చెందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

వర్షాకాలం... విద్యుత్‌తో అప్రమత్తం

- విద్యుత్ వైరింగ్, మోటార్లకు ఎర్త్ తప్పనిసరి..
- అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



గురజాల: వర్షాకాలం వచ్చింది. వర్షాలు కురుస్తున్నాయి. కరెంట్ సమస్యలు వస్తుంటాయి. విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలున్నాయి. ఇనుప విద్యుత్ స్తంభాలు, మోటార్ల వద్ద వైర్లు, విద్యుత్ స్తంభాలకు సపోర్టుగా ఉంచిన తన్నుడు తీగల వలన ప్రమాదాలు అధికంగా జరిగి ప్రాణ, ధన, ఆస్తి నష్టాలకు అవకాశం ఉంది. ఇళ్లలో ఉపయోగించే మోటార్లు, వ్యవసాయ అవసరాలకు వినియోగించే విద్యుత్ మోటార్ల విషయంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. స్టార్టర్లు బోర్డులకు విద్యుత్ సరఫరా అయినప్పుడు వాటిని తెలియక పట్టుకుని రైతులు, మూగజీవాలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చాలా ఉన్నాయి. ప్రజలు జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చని ఆయా శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు...

- విద్యుత్ మీటర్లు, స్విచ్ బోర్డులు బల్బులు, మోటార్లు వర్షానికి తడవకుండా చూసుకోవాలి. ఇంట్లో విద్యుత్‌వైరింగ్, వ్యవసాయ విద్యుత్ మోటార్లుకు ఎర్త్ ఉండేలా చూసుకోవాలి.
- దుస్తులు ఆరవేయడానికి ఇనుప తీగలు వినియోగించకూడదు.
- తడిచేతులతో విద్యుత్ సరఫరా అయ్యే పరికరాలు, హోల్డర్లు, సర్వీసు వైర్లు, స్విచ్‌లు తాకకూడదు. పిల్లలకు అందనంత ఎత్తులో స్విచ్ బోర్డులు విద్యుత్ పరికరాలు ఉండేలా చూసుకోవాలి.
- ఉరుములు, మెరుపులు వర్షం కురిసే సమయంలో టీవీలు, ఫ్రిజులు, ఏసీలు కంప్యూటర్లుకు విద్యుత్ సరఫరా లేకుండా చూసుకోవాలి.
- ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను వెంటనే తొలగించి కొత్త తీగలను ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యుదాఘాతానికి ఎవరైనా గురైతే వెంటనే మెయిన్ స్విచ్‌ను ఆఫ్ చేయాలి. సదరు వ్యక్తిని పొడి కర్రతో లేదా ప్లాస్టిక్ వస్తువులతో తొలగించి ఆస్పత్రికి తరలించాలి.
- పొలంలో వ్యవసాయ మోటారు తీగల కింద బురదలో లేకుండా చూసుకోవాలి. నాణ్యమైన తీగలను వాడాలి. మోటార్లను తడి చేతులతో ముట్టుకోరాదు.
- తీగలు తెగిపడినట్లు గమనిస్తే వెంటనే సంబంధిత లైన్‌మెన్‌కు సమాచారం అందించాలి.
- విద్యుత్ మోటార్లుకు స్టార్టర్లుకు ఇనుప బాక్స్‌లను కాకుండా ప్లాస్టిక్ బాక్సులను మాత్రమే అమర్చాలి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలంలో చిన్నపాటి నిర్లక్ష్యం వలన విద్యుత్ ప్రమాదాలు జరిగి మృత్యువాత పడే అవకాశం ఉంది. పశువులకు మేతకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలి. వర్షం కురుస్తున్న సమయంలో రైతులు విద్యుత్ మోటార్లను పట్టుకోవద్దు. పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లు, స్తంభాల వద్దకు వెళ్లరాదు. జాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టవచ్చు.

– వీరేశ్వరరావు, ఏడీఈ, ఇన్‌చార్జి గురజాల

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి


మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నాయకులు మహేష్

మాచర్ల రూరల్: నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 9వ తేదీ నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు బండ్ల మహేష్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబుకు సమ్మె నోటీసు బుధవారం అందించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెలో పాల్గొననున్నట్లు చెప్పారు. స్వాతంత్ర్యానికి ముందే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మిక హక్కులను నరేంద్ర మోదీ ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, రైతాంగవిధానాలను అవలంభిస్తుందన్నారు. లేబర్ కోడ్స్ రద్దు, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికుల పర్మినెంట్, ప్రైవేటు రంగాలలో రిజర్వేషన్లు అమలు చేసి ఎటువంటి షరతులు లేకుండా తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వేముల వెంకట్రావు పాల్గొన్నారు.

బీమా పథకంతో రైతులకు ఉపయోగం


రైతులకు వివరాలు తెలియజేస్తున్న అధికారులు

మాచవరం: ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ కె.శివకుమారి, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ డివిజనల్ కో–ఆర్డినేటర్ కిరణ్ కుమార్ సూచించారు. మండలంలోని మోర్జంపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా డీడీఏ కె.శివకుమారి మాట్లాడుతూ కొనుగోలు చేసిన విత్తనాల సంచులను పంట పూర్తి అయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. నాసిరకం విత్తనాలతో పంట దిగుబడి తగ్గితే డీలర్లపై చర్యలు తీసుకోవచ్చని వివరించారు. వివిధ పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఇన్సూరెన్సు డివిజినల్ కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పంటల బీమా పథకానికి కంది పంటకు ఎకరాకు రూ.40, మిరప పంటకు రూ.360, వరి పంటకు రూ.80, పత్తి పంటకు రూ.1900 ప్రీమియం దగ్గర్లోని పోస్టాఫీసులో గాని, గ్రామ సచివాలయంలో గాని చెల్లించాల్సి ఉంటుందన్నారు. అన్ని పంటలకు జూలై 31 చివరి గడువు కాగా, వరి పంటకు ఆగస్టు 15 వరకు చెల్లించవచ్చని వివరించారు. కౌలు రైతులు కౌలు రైతు కార్డు ద్వారా ప్రీమియం చెల్లించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఓలు కె.రామమ్మ, ఎం.అరుణ, సిబ్బంది జానీబాషా, మణిదీప్తి పాల్గొన్నారు.

ఇంటింటికీ టీడీపీ ప్రారంభం

వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడులో ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా లక్ష కోట్లు ఖర్చు చేసి సూపర్ సిక్స్ పథకాలను అందిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుర్రి శివారెడ్డి, కార్యదర్శి కళ్ళం రామాంజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పులుసు శివారెడ్డి, మాజీ అధ్యక్షుడు గుజ్జల పాపిరెడ్డి, మాచర్ల మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్ పాల్గొన్నారు.

రేపు దేవాలయ భూమి హక్కుల బహిరంగ వేలం

రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడులోని వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన 12.61 ఎకరాలు, రెంటాల గ్రామంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానానికి 1.16 ఎకరాల భూమి కౌలు హక్కుల వేలం గురువారం నిర్వహించనున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిట్టగుడిపాడు దేవస్థానంలో ఉదయం 11 గంటలకు, రెంటాల దేవస్థానంలో మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. వేలంలో పాల్గొనే రైతులు 2025–2026 నుంచి 2027–2028 వరకు మూడేళ్ల పాటు కౌలు హక్కును పొందవచ్చన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.5 వేలు ప్రథమ ధారావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు. కౌలు హక్కు పొందిన వారు ముందు గానే ప్రతి సంవత్సరం కౌలు చెల్లించి భూమిలో ప్రవేశించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఈ బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

నేడు ప్రైవేటు పాఠశాలలు బంద్..


ప్రైవేటు పాఠశాలల అధ్యక్ష, కార్యదర్శులు రమణ, శ్రీనివాసరావు తదితరులు

మాచర్ల రూరల్: విద్యా హక్కు చట్టం 12(1)సీ ప్రకారం ప్రైవేటు పాఠశాలలు ఒకటో తరగతిలోకి 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలన్న ప్రభుత్వ నిబంధనలను వ్యతిరేకిస్తూ స్థానిక ప్రైవేటు విద్యా సంస్థల అసోసియేషన్ గురువారం బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేవీ రమణ, శ్రీనివాసరావు బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌డీఈ ఉచిత అడ్మిషన్ ఫీజులు, బకాయిలు చెల్లించటం లేదని ప్రస్తుతం ఒక్కొక్క విద్యార్థి పై సగటున రూ.30 నుంచి రూ.40 వేలు స్థానిక పాఠశాలలో ఖర్చు అవుతుంటే ఉచిత అడ్మిషన్ల కింద ప్రభుత్వం ఒక్కొక్క సీటుకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.7 వేలు, పట్టణ ప్రాంతాలలో రూ.8 వేలు ఇస్తామనటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఉచిత అడ్మిషన్ల కోసం కేటాయించిన సీట్లకు అవుతున్న ఖర్చులను గుర్తించి ప్రభుత్వం తగిన విధంగా నగదు చెల్లించి ప్రైవేటు పాఠశాలల పై పడుతున్న భారాన్ని తగ్గించాలని వారు కోరారు. ప్రభుత్వం తగు విధంగా స్పందించాలని, ఏపీ ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గంలో గురువారం ప్రైవేటు పాఠశాలలను మూసి వేసి నిరసన తెలుపుతున్నట్లు వెల్లడించారు.

పలువురు వైద్యులకు సన్మానం


వైద్యులను సన్మానిస్తున్న డాక్టర్ ధూళిపాళ్ల భరత్ కుమార్ దంపతులు

పిడుగురాళ్ల: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డాక్టర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆడాక్టర్ ధూళిపాళ్ల భరత్ కుమార్ అధ్యక్షతన 'డాక్టర్స్ డే అవార్డులు, సన్మాన సభ-2025 ను పట్టణంలోని భవనాసి కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మొటూరి సుభాష్ చంద్ర బోస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ భరత్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి,పిడుగురాళ్ల బ్రాంచి లోగోను ఆవిష్కరించారు. డాక్టర్ బి.సి.రాయ్‌ని చిత్రపటం వద్ద పూలమాలతో నివాళులర్పించారు. డాక్టర్స్ డే సందర్భంగా కారంపూడికి చెందిన శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ నాయుడు వసంత రావు, పిడుగురాళ్ల పట్టణానికి చెందిన చిగురుపాటి హాస్పిటల్ అధినేత డాక్టర్ సి.సి.సుబ్బారావు, నీరజ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ బాదాం శివారెడ్డి, విజయ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ కె.వి.సుబ్బారావు, రామకృష్ణ నేత్రాలయం అధినేత డాక్టర్ అలా సాంబశివరావులను ఐఎంఏ పిడుగారాళ్ల బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ ధూళిపాళ్ళ భరత్ కుమార్, ముఖ్య అతిథి డాక్టర్ మొటూరి సుభాష్ చంద్ర బోస్‌ల చేతుల మీదుగా సన్మానించారు. డాక్టర్ భరత్ కుమార్ మాట్లాడుతూ పల్నాడు ప్రజలకు, అసోసియేషన్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. సుభాష్ చంద్ర బోస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 99 బ్రాంచిలు ఉండగా అందులో పిడుగురాళ్ల బ్రాంచి సంవత్సరకాలంలో భరత్ కుమార్ అధ్యక్షతన 17వ స్థానానికి చేరిందని తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఎం.వి.ఐ. శేషురెడ్డి



ప్రైవేట్ స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న శేషురెడ్డి

దాచేపల్లి: నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ శేషురెడ్డి అన్నారు. దాచేపల్లి పరిధిలో పలు ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులను బుధవారం తనిఖీ చేశారు. బస్సులు సంబంధించిన అనుమతి పత్రాలను, వాహనాలకు ఫిట్‌నెస్‌ను పరిశీలించి డ్రైవర్లకు పలు సూచన చేశారు. వాహన డ్రైవర్లకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా శేషురెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూలు బస్సులను నడిపేందుకు తప్పనిసరిగా అన్ని రకాల అనుమతులను తీసుకోవాలన్నారు. కాలం చెల్లిన బస్సులను నడపవద్దని, బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కూడా తీసుకోవాలని కోరారు. ఎప్పటికప్పుడు బ్రేక్ చేయించుకొని నిబంధనల ప్రకారమే బస్సులు నడపాలని సూచించారు. బస్సు డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఏఎంవీఐలు శ్రీనివాసరావు, సురేష్, కేఎల్ రావు ఉన్నారు.

ప్రజాప్రతినిధుల పల్లెనిద్ర

గురజాల రూరల్: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో బుధవారం సాయంత్రం మండల పరిధిలోని గురుకుల పాఠశాలను పరిశీలించారు. గ్రామంలోని ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ప్రారంభించారు. అనంతరం పల్లె నిద్రలో భాగంగా గ్రామంలో బస చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, శరమాళ్ల హనుమంతురావు, యాగంటి రామారావు, గనిపల్లి శ్యాం సుందర్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే నకిలీలకు చెక్

- పెదకూరపాడు నియోజకవర్గంలో నకిలీ విత్తనాల బెడద
- నష్టపోతున్న పత్తి, మిర్చి రైతులు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

పెదకూరపాడు/అమరావతి: వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు నేలలు పదునెక్కి ఖరీఫ్ సాగుకు పొలాలు దుక్కులు దున్ని.. విత్తనాలు విత్తేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా పత్తి, మిరప, కంది, మినుము, పరిమితంగా వరి, ఉద్యాన పంటలు సాగు చేస్తుంటారు. రైతులు విత్తనాలు సమకూర్చుకునే పనిలో ఉన్నారు. ఈ సమయంలో పలు రకాల విత్తన కంపెనీల ప్రచారం జోరందుకుంది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతుల అవసరాన్ని అవకాశంగా భావించి విత్తనాలను తక్కువ ధరలు ఆశ చూపి నకిలీలతో రైతులను నట్టేట ముంచే అవకాశం ఎక్కువగా ఉంది. రోజురోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచారార్భాటాలతో రైతులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాగా రైతులు విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్‌లు ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదులు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎంపికపై అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ శాఖ రైతులకు పలు జాగ్రత్తలను సూచిస్తుంది. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 10 వేల ఎకరాలలో పత్తి, 2 వేల ఎకరాలలో మిర్చి, అలాగే కంది, మినుము సుమారు 2,500 ఎకరాలలో సాగు చేయడానికి సిద్ధమవుతున్నారు. రైతులు విత్తనాలు ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసేటప్పుడు నియమ నిబంధనల ప్రకారం ఉన్నాయో లేవో సరిచూసుకుని కొనుగోలు చేయాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

షరా మామూలైంది..

పెదకూరపాడు నియోజకవర్గంలో రైతులు అధికంగా మిర్చి, పత్తి సాగు చేస్తుంటారు. దాదాపు 25,000 హెక్టార్లలో పత్తి, 15,000 హెక్టార్లలో మిర్చి సాగు చేస్తారు. గత రెండేళ్లగా నియోజకవర్గంలో పత్తి, మిర్చి రైతులు నకిలీ విత్తనాల బారిన పడి తీవ్రంగా నష్టపోయారు. చీడపీడలతో దిగుబడులు లేక అల్లాడుతున్న రైతులకు నకిలీ బెడద కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో లైసెన్స్ లేని విత్తనాల దుకాణాలు రైతులకు వల వేస్తున్నాయి. ఖరీఫ్ ప్రారంభం కావడంతో నకిలీ, నాసిరకం విత్తనాలు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. రైతులు ఈ కంపెనీల వలలో పడి నకిలీ విత్తనాలు కొనుగోలు చేయడం, ఆ తర్వాత మోసపోవడం షరా మామూలైంది.

విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- వ్యవసాయ శాఖ లైసెన్స్ కలిగిన దుకాణాలు, డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తయ్యేంత వరకు భద్రపరుచుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు కచ్చితంగా సంచిపై ఉందో లేదో చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు, ఎరువులు కొనకూడదు. అలాగే సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే మొలక శాతం చూసుకోవాలి. ఎరువుల నాణ్యత, పురుగుమందులపై అనుమానం ఉంటే తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు సహాయంతో పరీక్షలకు పంపాలి.
- సంచుల్లో ఎరువుతోపాటు అన్యపదార్థాలు కనిపిస్తే దానిని కల్తీ ఎరువుగా గుర్తించాలి.
- బిల్లులపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు పన్ను నెంబర్, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, రకం, బ్యాచ్ నెంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.
- వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు సూచనలు పాటించాలి.

అవగాహన కలిగి ఉండాలి



రైతులు విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల కొనుగోలులో అవగాహన కలిగి ఉండాలి. విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో ప్రభుత్వ నిబంధనలు రైతులు పూర్తిగా తెలుసుకుని కొనుగోలు చేయాలి. వేరే ప్రాంతంలో అ దిక దిగుబడి వచ్చిందని చెప్పే అక్రమార్కుల మోసపూరిత మాటలు నమ్మి నకిలీ విత్తనాలు కొనుగోలు చేయకూడదు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు రైతులు తప్పక పాటించాలి.

– అహ్మద్, మండల వ్యవసాయ అధికారి, అమరావతి

లైసెన్స్‌లున్న షాపుల నుంచే మద్యం కొనుగోలు చేయాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐలు విజయ్‌కుమార్, తులసి

సత్తెనపల్లి: ఏపీ ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్సు పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. లైసెన్స్ లేని వ్యక్తుల (అనధికార వ్యక్తుల) నుంచి మద్యం కొనుగోలు చేయడం ప్రమాదకరమని, అటువంటి మద్యం నకిలీది కావచ్చునన్నారు. వివాహాలు, పార్టీలు, ఇతర సామూహిక వేడుకల సందర్భాలలో మద్యం తగ్గింపు ధరలకు సరఫరా చేస్తామని చెప్పేవారు మిమ్మల్ని మోసం చేసే అవకాశం ఉందన్నారు. వారు సరఫరా చేసే నకిలీ మద్యం మీ ఆరోగ్యానికి హానిని కలిగించవచ్చని, కొన్ని సందర్భాల్లో మరణానికి కూడా దారి తీయవచ్చునన్నారు. కావున అటువంటి అనుమానిత వ్యక్తుల వివరాలను వెంటనే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు తెలియజేయాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎక్సైజ్ శాఖ సీఐ సత్తెనపల్లి నెంబర్–7649222228కు కానీ, పల్నాడు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారికి కానీ తెలపాలన్నారు.

క్రోసూరు/అచ్చంపేట: అనధికార వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు చేసి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ టి.తులసి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి లైసెన్సు పొందిన మద్యం దుకాణాల వద్ద మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని కోరారు. లైసెన్సు లేని వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు చేయడం ప్రమాదకరమని, అటువంటి మద్యం నకిలీది కావచ్చని అన్నారు. వివాహాలు, పార్టీలు లేదా ఇతర సామూహిక వేడుకల సందర్భాలలో మద్యంను తగ్గింపు ధరలకు సరఫరా చేస్తామని, చెప్పి మద్యం ప్రియులను మోసం చేసే అవకాశం ఉంటుందన్నారు. అది నకిలీ మద్యం కావచ్చని, కొన్ని సందర్భాలలో మరణానికి కూడా దారి తీయవచ్చన్నారు. కావున అటువంటి అనుమానిత వ్యక్తుల వద్ద నుండి మద్యం కొనుగోలు చేసి మోసపోవద్దని అన్నారు. అటువంటి వారు మీకు తారసపడితే వారి సమాచారం ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి 9440902480 లేదా క్రోసూరు ఎక్సైజ్ సీఐ 8309225378కి తెలపవచ్చన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాజుపాలెం: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవితేజ నాయక్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగీ మాసోత్సవాలలో భాగంగా రాజుపాలెం ఎస్సీ కాలనీలో అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవితేజనాయక్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వ్యాప్తి ప్రారంభమవుతుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. నిల్వ ఉన్న నీటిపై దోమల వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి వసంతరావు, హెల్త్ సూపర్‌వైజర్‌లు జీవన్‌రావు, ఉషారాణి, హెల్త్ అసిస్టెంట్ షరీఫ్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో డెంగీ మాసోత్సవ ర్యాలీ

ముప్పాళ్ల: జాతీయ డెంగీ మాసోత్సవంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారి పీ రమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా మురుగు కాల్వలను శుభ్రం చేసుకోవాలన్నారు. దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో హోమియో వైద్యురాలు పద్మావతి, సూపర్‌వైజర్ దస్తగిరి, పీటర్‌డేమియన్, ఎస్కే ఉస్మాన్, జైనుల్లా, స్టాఫ్‌నర్స్ మధు, ఫార్మసిస్ట్ పావని, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, ఏఎన్ఎంలు భాను, జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.